**కథ**

**'ముఖం మనసుకు విషయ సూచిక' అని ఆంగ్ల సామెత. అది భారతీయులకు వర్తించదని టీవీల్లో డెయిలీ సీరియల్సు చూసేవారందరూ నమ్మాలి. వాటిలో ఎంతో అందమైన ఆడవాళ్ళు తమ ముఖ సౌందర్యానికి ఏమాత్రమూ నప్పని క్రూరాతిక్రూరమైన పనులు అవలీలగా చేస్తూంటారు.**

# ఒకటే కోరిక

ఆ సంగతి అలా ఉంచితే ఇప్పుడే నేను దినపత్రికలో ఓ వార్త చదివాను. కేవలం వంటిమీద నగల కోసం ఓ కిరాతకుడు ఓ యిల్లాలి నిండుప్రాణాలు తీసాడన్న ఆ వార్త చదవగానే నేను ఆనందం పట్టలేక హుర్రే అని కేకపెట్టి కూర్చున్న కుర్చీలోంచీ ఎగిరి గంతువేసాను. నా ఆనందాన్నెవరైనా అపార్థం చేసుకుంటే 'స్పందనతో మనస్తత్వాన్ని అంచనా వేయకూడదు' అన్న ఉపసిద్ధాంతాన్ని ఇందాకటి ఆంగ్ల సామెతకు జత పరచక తప్పదు. అదెలాగంటే ముందుగా నా యింటి కథ వినాలి. నా యిల్లాలి గురించి తెలుసుకోవాలి.

భార్యా రూపవతీ శత్రుః అంటారు. నా భార్య పరాయి మగాళ్ళకే కాదు, పెళ్ళై ఇన్నేళ్ళైనా నాక్కూడా ఇంకా అందంగానే కనిపిస్తుంది. అయినా ఆమె నాకు శత్రువు కాదు. ఆమెలో కార్యేషు దాసీతో ప్రారంభమై శయనేషు రంభా దాకా అన్నీ నాకు పనికొచ్చే లక్షణాలే ఉన్నాయి. ఆమె నన్ను చీరలడగదు, నగలడగదు. సినిమాలూ, మల్లె పూలూ వంటి చిన్న చిన్న సరదాలు కూడా చంపుకుంటూ మా ఆదాయంతో మా బాధ్యతల నెదురీదడానికి సహకరిస్తూంటే ఒకరోజున అభిమానం పొంగిపోయి, ''నీ కోరికలు కొన్నయినా తీర్చాలని నా అభిలాష. నా ఆర్థిక పరిస్థితులనూ, పరిమితులనూ దృష్టిలో ఉంచుకుని నీ కోరికల జాబితా ఒకటి తయారుచేసి ఇవ్వు. వరుస క్రమంలో వాటిని తీర్చే ప్రయత్నం చేస్తాను'' అన్నాను.

నేను నిదానస్తుడినని అంతా మెచ్చుకుంటారు. దేవుడి మొక్కుల్లో కూడా నిదానం వదలనని నా భార్య నన్ను గేలిచేస్తూంటుంది. నా భార్యపై అభిమానం పొంగి పొరలిన ఈ క్షణంలోనూ అదే నిదానం చూపాను. అయినా ఆమె నన్ను గేలిచేయకుండా, ''నాకున్నది ఒకటే కోరిక. సమయం వచ్చినప్పుడు తప్పక చెబుతాను'' అంది నెమ్మదిగా.

''ఇది సమయం కాదా?'' అన్నాను ఆప్యాయంగా.

''మీ పరిమితులను బట్టి ఇది సమయం కాదు'' అంది శ్రీమతి నవ్వుతూ.

నాది నిదానమైతే ఆమెది దూరదృష్టి. పరిమితుల ప్రస్తావన తెచ్చిందంటే ఆమె కోరిక ఎంత పెద్దదోనని భయపడి, ''ఆలస్యం అమృతం విషం. ఆలోచించుకోమరి'' అంటూ హెచ్చరించాను.

''కైకకు దశరథుడు వరాలిచ్చినపుడాయనకింకా పిల్లలు లేరు. ఆమె వరమడిగే సమయానికి ఆయన నలుగురి పిల్లలకూ పెళ్ళిళ్ళు కూడా అయిపోయాయి. ఆమె అంతకాలం ఆగింది కాబట్టి ఆమె కొడుకు భరతుడు రాజయ్యాడు. అది నిదానం. మరి నిదానం లేని సీత చూస్తూనే బంగారు లేడి కావాలంది. అడగ్గానే తేవడానికి వెళ్ళాడు రాముడు. ఆ తర్వాత సీత బ్రతుకు కొంతకాలం లంకపాలూ, కొంతకాలం అడవి పాలూ అయింది. అందుకే నేను కైక వైపు'' అందామె.

''కైక కోరిక దశరథుడి ప్రాణాలు తీసింది. అది మర్చిపోకు'' అన్నాను కాస్త భయంగా.

''మా పురోహితుడు కృష్ణశాస్త్రిగారు చెప్పారు. దశరథుడి చావుకు కారణం కైక అడిగిన వరాలు కాదు. ముగ్గురు భార్యలున్న దశరథుడు విలాస జీవితానికి అలవాటుపడిపోయి ఆహార నియమాలు మరిచేడట. వ్యాయామాన్ని అలక్ష్యం చేసాడట. అందువల్ల ఆయన రక్తంలో కొలెస్ట్రాల్ బాగా పేరుకుపోయి హార్ట్ వాల్వ్సులో బ్లాకులు వచ్చాయి. కైక ఇచ్చిన షాకుకి ఆయనకు గుండెపోటు వచ్చింది. సమయానికి ఏ బైపాస్ సర్జరీయో చేయిస్తే ఆయన బ్రతికేవాడు. అప్పుడలాంటివి లేవేమో. నేరం కైక మీదకు పోయింది.''

''దశరథుడి చావు సంగతలాగుంచు. కైక వరాల తప్పొప్పులు చెప్పు-'' అన్నాను విసుగ్గా.

''ఏ ఆడదైనా భర్త వారసత్వం తన బిడ్డకు రావాలని కోరుకుంటే అది సహజమూ, న్యాయమూనూ! కాబట్టి కైక భరతుడికి రాజ్యాభిషేకం చేయమనడం తప్పుకాదు. తప్పు దశరథుడిది. ఆయన ముగ్గురు భార్యలను చేసుకోవడం తప్పే మరి. అది తప్పుకాదనుకుంటే తన బిడ్డ భవిష్యత్తుకు కంటకమైన రాముణ్ణి వనవాసానికి పంపమని కైక అడగడం తప్పుకాదు. అదీ భర్త వరమిచ్చాడనే కదా అడిగింది'' అంది శ్రీమతి దృఢంగా.

మన దేశంలో ఆడది ఎంతలా దోపిడీకి గురవుతోందంటే స్త్రీ వాదం మొలకదశలో కూడా పురుషుణ్ణి ఇబ్బంది పెట్టగలదు. నా భార్య ఆలోచనలను నాకిబ్బంది కలిగించని దారికి మళ్ళించాలనుకుని, ''అయితే భర్త భార్యకు వరాలివ్వడం తప్పంటావా'' అన్నాను.

''మీరు దశరథుడిలా కాదుగా. నాకు మీరు, మీకు నేను. నా బిడ్డలు మన బిడ్డలు. కాబట్టి నేనేం కోరినా బిడ్డలకోసం కాదు. కేవలం నాకోసం. నా కోసం ఏ కోరినా మీకు ప్రమాదం కాదని మీరూ ఒప్పుకుంటారు''

''సస్పెన్సుతో చంపక- నీ కోరికేమిటో ఇప్పుడే చెప్పొచ్చుగా..''

''కంగారొద్దు. మీ స్వయంకృషికి నా పాతివ్రత్యం తోడై మన ఆర్థిక పరిస్థితి ఏదో ఒక రోజున మీరు నా కోర్కెను తీర్చగల ఎత్తుకు చేరుకుంటుంది. అప్పుడు చెబుతాను. అదీ ఒకటే కోరిక..'' అందామె.


''మగాడు అన్ని వేళల్లోనూ తనను తాను పొగుడుకుని కొన్ని వేళల్లో మాత్రం భార్యను పొగిడి ఆమె నుంచి తనక్కావలసింది పొందగల్గుతాడు. ఆడది మాత్రం అన్ని వేళల్లోనూ భర్తనే పొగిడి అతడి అహాన్ని తృప్తిపరుస్తుంది. అయితే కొన్ని వేళల్లో ఆ పొగడ్తలకు తన్ను గురించిన ప్రశంసలూ జతచేసి తన ఉనికి ప్రాధాన్యాన్ని తెలివిగా అతడికి తెలియజేస్తుంది. నువ్వు ఆ తరహా ఆడదానివి'' అన్నాను. ఆమె తీసుకొచ్చిన పాతివ్రత్యం ప్రసక్తిపై వ్యంగ్యబాణం సంధిస్తూ.

''స్వయంకృషి విఫలమైతే దురదృష్టమంటారు. పాతివ్రత్యం విఫలమైతే కళంకమంటారు. నేనన్న మాటలో రిస్కంతా నాదే..మీకే రిస్కూ లేదు'' అందామె నా బాణాన్ని నాకే తిప్పికొడుతూ. ఆ మాట నిజమేమరి!

కొన్ని దశాబ్దాలు పడితేనేం- శ్రీమతి పాతివ్రత్యం ఋజువైంది. తల్లిదండ్రుల పట్ల నా బాధ్యతలన్నీ తీరాయి. మాకు ఓ అమ్మాయీ, అబ్బాయీ పుట్టి పెరిగి పెద్దవాళ్ళై బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసాం. ఇద్దరూ కూడా మా నుంచి పైసా ఆశించరు సరికదా మాకే డబ్బు పంపాలని సరదా పడుతూంటారు. నాకు ఫిక్సెడ్ డిపాజిట్లలో మూడు లక్షల రూపాయలున్నాయి. కంపెనీల్లో షేర్లు మరో మూడు లక్షలు విలువ చేస్తాయి. వేలు పెట్టి కొన్న కొన్ని స్థలాల ఇప్పటి విలువ ఇరవై లక్షలు దాటింది. నా నెల జీతం ముప్పై వేలు దాటింది. ఇంకా పదేళ్ళ సర్వీసుంది. రిటైరైతే పాతిక లక్షల దాకా చేతికొచ్చే సదుపాయాలున్నాయి. ఇంతా చేసి ఇప్పుడు నా వయసు యాభై. నా భార్య నాకంటే ఆరేళ్ళు చిన్నది.

ఇక సమయం వచ్చిందని నా భార్య తనకున్న ఒకటే కోరికను బట్టబయలు చేసింది. ఆమెకు బంగారం కావాలి. దేవుడొక్కడైనా రూపాలు ముక్కోటి అన్నట్లు ఆ బంగారానికీ కంటె, కాసులపేరు, చంద్రహారం, పలక సర్లు, వంకీలు, గాజులు, వడ్డాణం వగైరా రూపాలు చాలా ఉన్నాయి. వీలు ప్రకారం తీర్థయాత్రలు చేసి ఎక్కడెక్కడి దేవుళ్ళనూ చూసి వచ్చినట్లు నేను ఒకటొక్కటిగా ఆమెకా నగలను కొనిస్తూండాలి. ఆ కార్యక్రమానికి ఆరంభమే కానీ అంతమున్నట్లు లేదు.

అంతవరకూ నా భార్య నా వద్ద బంగారం ఊసు కూడా లేకపోతే ఆమెకు నగలపై మోజు



లేదనుకున్నాను. చెవులకు దుద్దులు, మెడలో మంగళసూత్రాలు, కాలివేళ్ళకు చుట్లు తప్ప మరే ఆభరణమూ ఎరుగని ఆమెపట్ల రవంత జాలిపుట్టి, ''ఇంత వ్యామోహాన్ని మనసులో దాచుకుని ఇన్నాళ్ళాగేవా? ముందే తెలిస్తే అడపాదడపా అవీ యివీ కొంటూ ఈపాటికే కొన్నైనా నీ సరదాలు తీర్చి ఉండేవాణ్ణి'' అన్నాను.

ఆమె నవ్వి, ''సాక్షాత్తూ లక్ష్మీదేవి అవతారమే అయిన సీతాదేవి కూడా లేడికి బంగారు చర్మముంటే మోజుపడింది. బంగారంపట్ల వ్యామోహం స్త్రీ సహజం. అయితే మధ్యతరగతి కుటుంబాలకు బంగారం రాక్షసమాయకు ప్రతిరూపం. అందుకే మనం మధ్యతరగతి స్థాయి దాటే దాకా ఆగాను..'' అంది.

''ఆగేవు కానీ- ఆబగా ఉన్నావిప్పుడు..''

''పుట్టుగ్రుడ్డి అయిన ధృతరాష్ట్రుడు కూడా దైవసాక్షాత్కారం జరిగితే విశ్వరూపాన్నే కోరాడు. బంగారం పట్ల నాకున్నది వ్యామోహం కాదు. భక్తి. బంగారం విశ్వరూపాన్ని దగ్గర చేసుకోవడమే నా జీవితాశయం..''

ఆమె మాటలకు నేను బెదిరిపోయాను. ఎందుకంటే ఈరోజు నేనీస్థితికి ఎదగడానికి కారణం ఇన్వెస్ట్మెంట్లు. పెట్టుబడికి బంగారం ఏమాత్రం పనికి రాదు. మిగతా పెట్టుబడులు ఆదాయాన్ని వృద్ధి చేస్తే బంగారం అటు ఖర్చును పెంచుతూ ఇటు ఆదాయానికీ బ్రేకు వేస్తుంది. శ్రీమతికదంతా వివరించి, ''ఏదో కొద్దిగా బంగారం కొనుక్కో...ఇలా డబ్బంతా బంగారం మీద పెట్టడం మన భవిష్యత్తుకు మంచిది కాదు'' అన్నాను.

''ఇంతవరకూ వెనకేసింది చాలు. ఇక మీదట వచ్చే ఆదాయమంతా బంగారం మీదే ఖర్చు చేద్దాం. అది నా ఒకే ఒక్క కోరిక. తీర్చుతానని మీరు మాట కూడా ఇచ్చారు'' అందామె.

అప్పుడు నేను ఇంకో దారి ఎన్నుకున్నాను. ప్రతిరోజూ పేపరు శ్రద్ధగా చదువుతూ నగరంలో బంగారం కోసం జరిగే దొంగతనాల వార్తల కటింగ్సు నామెకివ్వసాగాను. అలా వారం రోజులు జరిగేక ఆమె నాతో, ''నూనె కొలెస్ట్రాల్ని పెంచుతుంది. అయినా ఊటావకాయ మానం. ఉప్పూకారం రక్తపుపోటును పెంచుతాయి. అయినా అవి మనకిష్టం. తాగుడు ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్న ప్రచారంతో పాటే రోజుకో కొత్త బారు వెలుస్తోంది. అంటే మనిషికి ఆరోగ్యం మీద శ్రద్ధ లేదని కాదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఏమీ ప్రమాదం కాదు'' అంటూ నా చేతికి కొన్ని కాగితాలిచ్చింది. అవి నగరంలో కొత్తగా వెలిసిన బంగారు నగల దుకాణాల ప్రచార పత్రాలు.

మాటల్లో శ్రీమతిని గెలవడం కష్టమేనని గ్రహించిన సమయంలో ఓ కిరాతకుడు ఓ ఇల్లాలిని నిండు ప్రాణాలు తీస్తే, ఆ వార్తకు ఎగిరిగంతేయనా మరి! ఆ ఉత్సాహాన్ని దాచుకుని బాధను నటిస్తూ నా భార్యకా వార్త వినిపిస్తే ఆమె కూడా ఎగిరిగంతేసి, ''అయితే బంగారం-పునిస్త్రీగా పోవాలన్న నా ఆశను కూడా నిజం చేస్తుందన్నమాట. నా కోరిక విషయంలో మాట తప్పరు కదూ!'' అంది.

బంగారం కోసం చావుక్కూడా భయపడని ఆమెనెలా అదుపు చేయాలో తెలియక, ''నీతో జీవితం నాకింకా తనివి తీరలేదు. మనం మరిన్ని సంవత్సరాలు కలిసి జీవితాలంటే నువ్వు బంగారం సంగతి వదిలి పెట్టి ఇంకేదైనా కోరుకో. మన జీవితం స్వర్గతుల్యమవుతుంది'' అన్నాను.

ఆమె తక్కువ తిందా! నేనిలా మాట పూర్తి చేయగానే, ''మీరు మాట తప్పేరన్న భావం అనుక్షణం నన్ను ముల్లై గుచ్చుతూంటే మీతో జీవితం నాకు నరక ప్రాయమవుతుంది. ఆపైన మీ యిష్టం'' అంది.

''నువ్వు దూరం ఆలోచించడం లేదు. ఇంట్లో బంగారముంటే దొంగల భయంతో జీవితం నరకప్రాయమవుతుంది. ఏ బందిపోట్లో మనింటి మీద దాడిచేస్తే నువ్వూ నేనూ చావొచ్చు. లేదా నేనొక్కడినే చావొచ్చు'' అంటూ నా దగ్గరున్న చివరి అస్త్రం ప్రయోగించాను. ఆమె దానికీ చలించక, ''నా స్నేహితురాలు చారుమతి ముప్పై ఏళ్ళు నిండకుండానే కారు ప్రమాదంలో చనిపోయింది. దాని బామ్మ ఎనభై ఏళ్ళ వయసులో బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంకా చులాగ్గా తిరుగుతోంది. చావుకి కారణాలు మనమంటగడతాం కానీ- జరిగేదంతా రాసిపెట్టిన ప్రకారమే జరుగుతుంది. కాబట్టి మనం అన్నింటికీ సిద్ధపడి ఉండాలి. ఎటొచ్చీ బ్రతికినంత కాలం చావుకు భయపడకుండానూ, మాట తప్పలేదన్న తృప్తితోనూ బ్రతకాలి'' అనేసింది.

బంగారం విషయంలో ఆమెను ఆపడం నావల్ల కాదని తెలిసేక మా యింటి పురోహితుడు రామశాస్త్రిని కలుసుకున్నాను. ఆయన అవసరానికి తగ్గట్లు పురాణ కథల్లల్లడంలో అఖండుడు. ఆయన మా

వసుంధర

యింటికెప్పుడొచ్చినా పురాణ కాలక్షేపంలా ఉంటుందని శ్రీమతి మెచ్చుకుంటూంటుంది. అలాగే ఓ రోజున ఆయన మా యింటికొచ్చి నేను కోరగా వచ్చిన విషయం చెప్పకుండా మాకో పురాణ కథను చెప్పాడు.

''క్షీరసాగర మథనం జరిగేక శ్రీమహావిష్ణువు మోహినిగా అవతరించి అమృతం పంపకంలో రాక్షసులకు అన్యాయం చేసాడు. ఆ తర్వాత రాక్షస కులంలో ప్రహ్లాదుడి వంటి విష్ణుభక్తులు, బలిచక్రవర్తి వంటి ధర్మాత్ములు పుట్టారు. వారు విష్ణువుకు తమ జాతికి జరిగిన అన్యాయం చెప్పుకుని బాధపడ్డారు. అప్పుడు విష్ణువు వారితో, ''రాక్షసుల్లో కొందరు మంచి పనులు చేసారు. దేవతలెందరో తప్పులూ చేసారు. అయినా కృత, త్రేతా, ద్వాపర యుగాల్లో దేవతలదే పైచేయిగా ఉంటూ వచ్చింది. అందుకని కలియుగంలో రాక్షసులదే పైచేయిగా ఉండేలా వరమిస్తున్నాను. వారి చేతిలో ధనం, అధికారం ఉంటాయి. అందువల్ల కలియుగంలో మద్యమే అమృతంగా చెలామణీ అవుతూంటుంది. దేవతలు సామాన్య మానవులుగా ఉంటారు. వారి దైవత్వం ఓటు రూపంలో ఉంటుంది. నేను రాక్షసులకిచ్చిన వరప్రభావం వల్ల దేవతలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోలేరు. వారు రాక్షసులకే పట్టం కట్టి అధికారమిస్తారు. విద్యావంతులై విచక్షణ జ్ఞానం కలిగి ఉన్నంతలో తృప్తిగా జీవిస్తూ కాంతాకనకాలపైన వ్యామోహమూ, దుర్వ్యసనాలపై ఆకర్షణా లేకుండా జీవితం గడిపే సామాన్యులు ధన్యులై మరణానంతరం తిరిగి దేవత్వాన్ని పొంది నా దరికి చేరుకుంటారు. తక్కినవారు జనన మరణాల రొంపిలో చిక్కుకుని అవస్థపడుతూంటారు. దేవతలకు హెచ్చరికగా ఉండడానికి శీలం విషయంలో ఎయిడ్స్ వ్యాధినీ, బంగారం విషయంలో చోర భయాన్నీ సృష్టిస్తాను. ఆ హెచ్చరికను అందుకోనివారికి సకలావస్థలూ తప్పవు'' అని చెప్పి ఊరట కలిగించాడు. ఇప్పుడు కలియుగం రానే వచ్చింది కాబట్టి రాక్షస బాధనుంచి తప్పించుకోగోరిన వారందరూ శృంగారంలో అక్రమసంపర్కానికీ, బంగారంపై వ్యామోహానికీ దూరంగా ఉండాలి.

ఈ కథ శ్రీమతిని బాగా కలవరపర్చింది. ఆ రాత్రి ఆమె నాతో, ''ఇప్పుడీ ప్రపంచమిలా ఉండడానికి కారణాన్ని రామశాస్త్రిగారు చక్కగా చెప్పారు. నేనిక బంగారం కొనమని మిమ్మల్నడగను. కానీ మీరు మాట తప్పారన్న అసంతృప్తి నన్ను వదలడం లేదు. నేనే గనుక మహాపతివ్రతనైతే వారం తిరక్కుండా మన సమస్యకు చక్కటి పరిష్కారం లభిస్తుంది. అది మనిద్దరికీ అనుకూలంగా ఉంటుంది'' అంది.

ఆమె పాతివ్రత్య ప్రభావంతో వారం లోపులోనే ఆమె ఇంటి పురోహితుడు కృష్ణశాస్త్రి మా యింటికొచ్చాడు. రామశాస్త్రిలాగే ఆయన కూడా ఓ పురాణ కథను చెప్పాడు.

''ఒకానొకప్పుడు లకుర అనే యువతి దీర్ఘకాలం తపస్సు చేసి దైవసాక్షాత్కారం పొంది తానెప్పుడు ఎంత కోరితే అంత- ఏ రూపంలో కోరితే ఆ రూపంలో- బంగారం నగల రూపంలో తన శరీరాన్నలంకరించాలని వరమడిగింది. దేవుడామెకా వరాన్నిచ్చి, ''నీ మనసు తుచ్ఛమైన బంగారం మీదనే లగ్నమైంది కాబట్టి నీవంటి మీద బంగారం తప్ప ఇంకే తరహా వస్త్రాలూ నిలువవు'' అని మాయమయ్యాడు. లకుర కలవరపడ లేదు. అప్పట్నించీ ఆమె బంగారు వస్త్రాలనూ, నగలనూ ధరించి తిరుగుతూండేది. మేని మెరుపునకు అలంకరణ తోడు కాగా జిగేల్మనిపించే ఆమె అందానికి బంకుడనే ఋషి మోహితుడయ్యాడు. ఇద్దరూ పెళ్ళి చేసుకుని అడవిలో ఓ ఆశ్రమంలో కాపురం పెట్టారు. అలా కొద్దిమాసాలు విలాస జీవితం గడిపేక ఋషి తిరిగి నిత్యకర్మలకు పూనుకుంటూ, ''నీ స్వర్ణ వస్త్రాలు, ఆభరణాలు ఆశ్రమ వాతావరణానికి భిన్నంగా ఉన్నాయి. ఇక మీదట నీవు స్వర్ణాన్ని విసర్జించి నార చీరలు మాత్రమే ధరించాల్సి ఉంటుంది'' అని భార్యకు చెప్పాడు. లకుర భర్తకు అసలు విషయం చెప్పకుండా తను స్వర్ణాన్ని తప్ప ఇంకేమీ ధరించనని దర్పంగా చెప్పింది. అందుకు బంకుడు కోపించి, ''ఇక మీదట స్వర్ణం నీ వంటిపై ఏ రూపంలోను నిలువదు. నీవు ధరించిన ప్రతి స్వర్ణాభరణమూ స్వర్ణాన్నభిలషించే వేర్వేరు ఇతర మానవులను చేరుకుంటుంది'' అంటూ శాపమిచ్చాడు. ఆ శాపంతో లకుర వెంటనే నగ్న సుందరిగా మారిపోయింది. అప్పటికి అసలు విషయం తెలుసుకున్న బంకుడు జరిగిందానికి ఎంతో విచారపడి, ''దేవుడి వరమూ, నా శాపమూ-రెండూ అమోఘాలు. ఇక మీదట నీవు జీవితాంతం వివస్త్రగానే ఉండిపోతావు. అందుకని ఆశ్రమ కుటీరం నుంచి బైటకు రాలేవు'' అని భార్యకు చెప్పాడు. అలాగే లకుర భర్తతో కొంతకాలం కాపురం చేసింది కానీ ఆ జీవితం ఆమెకు నచ్చలేదు. ఎప్పుడైనా ఆమె బంగారు నగపై మోజు పడితే అది ఎక్కడో ఇతర మానవుల వంటిని అలంకరించిన విషయం చెవిలో వినపడేది. అటు బంగారంపై మోజు తీరక, ఇటు ఆశ్రమ కుటీరానికీ అంకితం కాలేక ఆమె ఒకరోజున ఆత్మహత్య చేసుకుని ప్రాణం తీసుకుంది. భార్యను ప్రాణప్రదంగా ప్రేమించిన బంకుడు విరహం భరించలేక దేవుణ్ణి స్తోత్రం చేశాడు. అప్పుడు దేవుడు ప్రత్యక్షమై, ''విచారించకు. కలియుగంలో నీవు ఓ గొప్ప వ్యవస్థగా జన్మిస్తావు. అప్పుడు లకుర అంశ నీ ఆధీనంలో ఉంటుంది. నా అనుగ్రహం కారణంగా ఎందరో మానవులు ఇష్టపూర్వకంగా తమ ఆభరణాలతో ఆమెను అలంకరిస్తారు. తన ఆభరణాలన్నీ ఇతరుల పాలవుతున్నందుకు బాధపడ్డ లకురకు ఆ విధంగా ఇతరుల ఆభరణాలు తనకు లభించడం ఎంతో ఉపశాంతినిస్తుంది. ఆ ఆభరణాలే ఆమె మానాన్ని కాపాడతాయి. ఆ విధంగా ఆమె మానాన్ని కాపాడినవారందరికీ అంతులేని పుణ్యం లభించేలా వరమిస్తున్నాను. నీవు, లకుర కలియుగాంతం వరకూ అన్యోన్యంగా ఎడబాటు లేని జీవితం గడుపుతారు'' అని చెప్పి మాయమయ్యాడు. ఆ బంకుడే కలియుగంలో బ్యాంకుగా అవతరించాడు. లకుర అంశ లాకరు పేరుతో అతడి సంరక్షణలో ఉంటోంది. ఎందరో స్త్రీ, పురుషులు కేవలం లకుర మానం కాపాడ్డానికే బంగారాన్ని నగల రూపంలో కొని ఆ నగలను లాకరులో దాచుకుని అనంతమైన పుణ్యం సంపాదించుకుంటున్నారు.''

ఈ కథ చెప్పి కృష్ణశాస్త్రి వెళ్ళిపోయాడు.

ఇక మా ఎత్తులూ పై ఎత్తులూ అయిపోయాయి. అప్పట్నించీ నేను అంచెలంచెలుగా బంగారునగలు కొంటూ శ్రీమతి ఒకటే కోరికను తీర్చే ఉడతాభక్తి ప్రయత్నాలు కొనసాగిస్తూ నామాట నిలబెట్టుకున్నాను.

నా భార్య సరదాకు కూడా ధరించకుండా బంగారు నగలను కొన్న వెంటనే లాకరుకు తరలిస్తూ లకుర మానాన్ని కాపాడిన పుణ్యాన్ని పోగుచేసుకుంటూ తనకు బంగారం మీద ఏమాత్రం వ్యామోహం లేదని ఋజువు చేసుకుంది.

మహాపతివ్రతనని పదే పదే ఋజువు చేసుకున్న నా భార్య 'ఒకటే కోరిక'కూ 'ఒకడే దేవుడు' లాగా విశ్వరూపముంటుందని తెలుసుకున్న నేను నా జ్ఞానోదయాన్ని అక్షరకిరణాల రూపంలో ప్రసరిస్తే అదే ఈ కథ. ఇంకా జ్ఞానోదయం కాని గతంలో నేను లాంటి వారికిది ఉపయోగపడుతూందని నా నమ్మకం. సెలవా మరి! ★

